క్లుప్తంగా

'వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి'

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం ఎలికేశ్వరం గ్రామానికి చెందిన రాళ్లబండి నాగరాజు మహదేవపూర్ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో మృతిచెందాడని, ఆయన మృతికి కారణమైన వారిని విచారణ చేసి సస్పెన్షన్ చేయాలని మంథని నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ మహిళ నాయకులు కేదారి గీతాబాయ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆస్పత్రికి రావాలంటే రోగులు భయపడుతున్నారన్నారు. సంబంధితశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

నాయీబ్రాహ్మణుడి ఔదార్యం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో దేవస్థానం, గోదావరి తీరం, గ్రామంలో మతిస్థిమితం లేని వ్యక్తి సంచరిస్తుండగా గురువారం కాళేశ్వరానికి చెందిన నిట్టూరి రాకేశ్ అనే నాయీ బ్రహ్మణుడు అతడికి గుండు చేసి స్నానం చేయించాడు. దీంతో అతడి ఔదార్యానికి స్థానికులు అభినందించారు.

బియ్యం అందజేత



బియ్యం అందిస్తున్న నాయకులు

టేకుమట్ల: మండల కేంద్రంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో వనం భద్రయ్యకు చెందిన ఇళ్లు పూర్తిగా దగ్ధమైంది. దీంతో వారికి ముదిరాజ్ సంఘం యువజన నాయకులు గురువారం 25కిలోల బియ్యం అందించి, భరో సా కల్పించారు. అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన వారి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. నాగరాజు, తిప్పరవేని నాగరాజు, వేమ రాజు ఉన్నారు.

సంపులో పడి పాడిగేదె మృతి



టేకుమట్ల: సంపులో పడి పాడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని రామకిష్టాపూర్ (టి)లో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రామకిష్టాపూర్ (టి)లో బోండ్ల మహేష్‌కు చెందిన పాడి గేదె గురువారం తెల్లవారు జామున ప్రమాదవశాత్తు ఇంటి ముందు ఉన్న నీటి సంపులో పడి ఊపిరాడక మృతి చెందినట్లు తెలిపారు. గేదె విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని పేర్కొన్నారు.

పిడుగు పడి గేదె..



మొగుళ్లపల్లి: పిడుగు పడి గేదె మృతిచెందిన సంఘటన మండలంలోని మొట్లపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం మొట్లపల్లి గ్రామానికి చెందిన డ్యాగ రమేష్ చెందిన పాడి గేదె రోజు వారిలాగే గ్రామ శివారులో పశ్రుగాసం మేస్తున్న గ్రామంలో పిడుగు పడడంతో గేదె అక్కడికక్కడే మృతిచెందిది. గేదె విలువ సూమారు రూ.50 వేలు ఉంటుందని నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు రమేశ్ కోరారు.

తారురోడ్డుకు మోక్షమెప్పుడో?

- అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



చల్లగరిగ-కోడవటంచ గ్రామాల మధ్య ఉన్న కంకర రోడ్డు

చిట్యాల: మండలంలోని చల్లగరిగ నుంచి రేగొండ మండలం కొడవటంచ వరకు మూడు కిలోమీటర్ల మేరకు గ్రామీణ ప్రాంతాల రోడ్డు మరమ్మతుల కోసం రూ.కోటి 70లక్షల నిధులతో తారు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఎనిమిది నెలల క్రితం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ మేరకు పనులను కాంట్రాక్టర్ ప్రారంభించి కంకర, చూర పోసి వదిలివేయడంతో రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా నిలిచి పోయింది. రోడ్డు వెంట వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు అనేక అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. దుమ్ము ధూళితో అనేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కంకర తెలిన రోడ్డుపై వాహనాలు వెళ్లుతుంటే అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తారు రోడ్డు నిర్మాణం చేపట్టేలా చూడాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

సదస్సులతో భూ సమస్యల పరిష్కారం



కాటారం: అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్



భూపాలపల్లి రూరల్: దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

- కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్

కాటారం: రెవెన్యూ సదస్సులతో గ్రామాల్లో భూ సమస్యలు సత్వరం పరిష్కారం అవుతాయని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ అన్నారు. కాటారం మండలకేంద్రంలోని రైతువేదికతో పాటు జాదారావుపేట గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు కొనసాగాయి. కాటారంలో రెవెన్యూ సదస్సును సబ్ కలెక్టర్ పరిశీలించారు. దరఖాస్తుల వివరాలు నమోదు చేస్తున్న రిజిస్టర్, దరఖాస్తుల వివరాలను పరిశీలించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని అనంతరం ఆన్‌లైన్‌లో ఎంటర్ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రైతులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు రైతులు, భూయజమానులు సహకరించాలని తెలిపారు. కాటారంలో 397, జాదారావుపేటలో 146 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. ఈ సదస్సుల్లో నయాబ్ తహసీల్దార్ రామ్మోహన్, ఆర్ఐ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని దుదేకులపల్లి, గొల్లబుద్దారంలో గురువారం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల్లో తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ అంజిరెడ్డి, అధికారులు రామస్వామి, హజరొద్దీన్, రాజు, రజిత, రాజ్యలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

మల్హర్: మండలంలోని కొండంపేటలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ గ్రామసభలో భూ సమస్యలపై రైతుల నుంచి 175 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రెవెన్యూ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఎస్ఓ శివ, రెవెన్యూ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల: దరఖాస్తును స్వీకరిస్తున్న తహసీల్దార్ షేక్ ఇమామ్ బాబా

చిట్యాల: మండలంలోని జూకల్‌లో భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సు నిర్వహించినట్లు తహసీల్దార్ షేక్ ఇమామ్ బాబా తెలిపారు. రైతులు వారి భూ సమస్యలను దరఖాస్తుల ద్వారా అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. జూకల్‌లో 269 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ మోబినోద్దీన్, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సునీత సూచించారు. గురువారం మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 157 , దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. ఆర్డీఓ కార్యాలయ డీఏఓ రంగా, ఆర్ఐ శివరామకృష్ణ పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలి



టేకుమట్ల: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

టేకుమట్ల: పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని అంగన్‌వాడీ టీచర్లు ఈర్ల పూర్ణిమ, పెండెం హేమలత, ఈర్ల రజిత అన్నారు. గురువారం మండలంలోని రామకిష్టాపూర్(వి)లో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి వారి భవిష్యత్‌కు బంగారు బాటను వేయాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారంతో పాటు, ప్రీ ప్రైమరీ విద్యాభ్యాసం, ఆటలు వంటివి నేర్పిస్తారని అన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలకు ప్రతీ రోజు పౌష్టికాహారాన్ని అందిస్తారని తెలిపారు. చిన్న పిల్లల తల్లులు, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కుడికాల శ్రీనివాస్, శనిగరపు రాజమోహన్, ములుకనూరి రాజన్న, అంగన్‌వాడీ ఆయాలు సారమ్మ, రజినీ, సునీత, తల్లులు తదితరులు ఉన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కేంద్రంతో పాటు పలుగుల తదితర గ్రామాల్లో అమ్మమాట-అంగన్‌వాడీ బాట అనే కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో వేర్వేరుగా నిర్వహించారు. గురువారం మహదేవపూర్‌లో సూపర్‌వైజర్ నాగరాణి మాట్లాడుతూ.. రెండున్నర సంవత్సరాల పిల్లల నుంచి ఐదు సంవత్సరాల పిల్లలవరకు అంగన్‌వాడీల్లో చేర్పించాలనాన్నారు. అంగన్‌వాడీ టీచ ర్లు సునీత, పలుగు-2 టీచర్ ఉమామహేశ్వరీలు పాల్గొన్నారు.



కాటారంలో..



కాళేశ్వరం: పలుగులలో..

కాటారం: అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లల బంగారు భవిష్యత్‌కు పునాదులు వేయడానికి ఎంతగానో దోహదపడుతాయని ఐసీడీఎస్ కాటారం సెక్టార్ సూపర్‌వైజర్ శివరాణి, గంగారం సెక్టార్ సూపర్‌వైజర్ వీణ అన్నారు. మండల కేంద్రంతో పాటు గంగారం , అల్లీపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలపై అవగాహన కల్పించారు. ఎన్జీఓ కోఆర్డినేటర్ సమ్మయ్య, అంగన్డీ టీచర్లు శ్రీలతరెడ్డి, విమల, శ్యామల, ప్రేమలత, కృష్ణవేణి, సులోచన, పుష్పలత, సునీత, కిశోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

మొగుళ్లపల్లి: కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు వానాకాలం రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.సురేందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు భరోసా పథకం వానాకాలం-2025 కోసం భూ భారతిలో ఈ నెల 05 తేదీ వరకు నమోదయిన వారు పథకానికి అర్హులని పేర్కొన్నారు. పట్టాదారు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్‌లతో తమ వివరాలను రైతులు ఈ నెల 20 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రైతులు సందేహాలు ఉంటే ఆయా గ్రామాల ఏఈఓలను సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయ పోస్టులకు..

కాటారం: మండలంలోని గంగారం తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో భాగంగా హవర్లీ బేసిడ్ పద్ధతిన బోధించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గోవర్ధన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీటీ జువాలజీ, మ్యాథ్స్, టీజీటీ ఇంగ్లీష్ సబ్జెక్టుల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులలో డిగ్రీ, పీజీ, బీఈడీ, టీజీటీ పూర్తి చేసిన వారు అర్హులని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 16న ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాఠశాలలో హాజరుకావాలని ఆయన సూచించారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

రేగొండ(కొత్తపల్లిగోరి): దశాబ్దాలుగా తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు అందజేయాలని గాంధీనగర్ మాజీ సర్పంచ్ సంతోశ్ రైతులతో కలిసి తహసీల్దార్ లక్ష్మీరాజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. కొత్తపల్లిగోరి గ్రామ శివారులో గల సర్వే నంబర్లు 1653, 821, 1652, 391 గల భూములను దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నామని తెలిపారు. సాగు పట్టాల కోసం పలుమార్లు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో భూములు సర్వే చేసినా పట్టాలు ఇవ్వాలేదని వాపోయారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మొగుళ్లపల్లి: మండలంలోని అంకుషాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై హౌజింగ్ ఏఈ హర్షిణి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు కొలతల ప్రకారం నిర్మాణం చేపట్టాలన్నారు. విడతల వారీగా డబ్బులు జమవుతాయని తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు.

చెక్కుల పంపిణీ

కాటారం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరు కాగా ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు వ్యక్తిగత ప్రభుత్వ సహాయకుడు ఆకుల చంద్రశేఖర్ గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలానికి సంబంధించి 32 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, 84 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు.

మల్హర్: మండలంలో లబ్ధిదారులకు మంజూ రైన కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు ఆయన వ్యక్తిగత ప్రభుత్వ సహాయకుడు చంద్రశేఖర్ గురువారం లబ్ధిదారులకు అందించారు. మండలంలోని తాడిచర్ల, ఎడ్లపల్లి, కొండంపేట, కొయ్యూరు, వల్లెకుంట, మల్లారం గ్రామాల్లో 41 కల్యాణలక్ష్మి చెక్కులు, 19 సీఎంఆర్ఎఫ్ చెక్కులు రాగా నేరుగా లబ్ధిదారులకు అందించినట్లు చంద్రశేఖర్ తెలిపారు.



కాటారం: చెక్కులు ఇస్తున్న చంద్రశేఖర్

పుస్తక ఆవిష్కరణను విజయవంతం చేయాలి

భూపాలపల్లి రూరల్: హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో రేపు (శనివారం) ఓబీసీ పోరుబాట పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని బీసీలు, అనగారిన వర్గాల సామాజిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెన్నంపెల్లి పాపయ్య పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఎంహెచ్‌కార్యాలయంలో ఓబీసీమోర్చా జిల్లా అధ్యక్షుడు జగ్గయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పాపయ్య ముఖ్య అతిగా హాజరై పుస్తక ఆవిష్కరణకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ ఐఏఎస్ అధికారి మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ పరికిపండ్ల నరహరి, హైకోర్టు న్యాయవాది పృథ్వీరాజ్‌సింగ్‌లు సంయుక్తంగా ఓబీసీల పోరుబాట పుస్తకాన్ని రచించారన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ నాయకులు కంబాల రాజయ్య, నాయకులు బట్టు రవి, మదుసుధన్‌రెడ్డి,రాంరెడ్డి, కోరేసుధాకర్, మునేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



టేకుమట్ల: పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ సుధాకర్



కాళేశ్వరం: పుస్తకాలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ రామారావు

- మండల విద్యాధికారి సుధాకర్

టేకుమట్ల: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమెన విద్య లభిస్తుందని మండల విద్యాధికారి చిదిరాల సుధాకర్ అన్నారు. గురువారం 2025-26 విద్యాసంవత్సర పునఃప్రారంభం సందర్భంగా మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు, నోటు పుస్తకాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలతో పాటు, ఆంగ్ల మాధ్యమంలో విద్యనందిస్తున్నారని అన్నారు. అన్ని రకాల వసతులతో కూడిన ప్రభుత్వ విద్యను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిత, పంకజ, అనిత, అంకూస్, ప్రకాశ్, తిరుపతి, వింధ్యారాణి, కృష్ణారావు, రంగారెడ్డి, మోజెస్, రమాదేవి, అనురాధ, ఆనంద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వాగతం

మొగుళ్లపల్లి: మండల వ్యాప్తంగా గురువారం ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. మొట్లపల్లి ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ప్రవేశం తీసుకున్న పిల్లలకు పాఠశాలను బెలూన్లతో, రంగుల పేపర్లతో, పూలతో, అరటి తోరణాలతో పాఠశాలను అలంకరించుకుని, పిల్లలకు స్వీట్లు, చాక్లెట్లు, బిస్కట్ల పంపిణీతో స్వాగతం పలికారు. ప్రధానోపాధ్యాయుడు టి.మహేశ్, ఉపాధ్యాయులు నాగేందర్, సురేందర్, శ్రీధర్, రమేశ్, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో హెచ్ఎం రాజిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. గురువారం మొదటి రోజు విద్యార్థులు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొందని, ప్రభుత్వం పాఠశాలల్లో అనుభవాజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలతోనే పునఃప్రారంభం



రంగరాజాపురంలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం



శిథిలావస్థకు చేరిన బెస్తగూడెం పాఠశాల భవనం

- శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాలల భవనాలు
- పట్టించుకోని అధికారులు

వెంకటాపురం(కె): మండలంలోని సర్కారు బడులు సమస్యలతోనే గురువారం పునఃప్రారంభమయ్యాయి. మండలంలో మూడు ఆశ్రమ పాఠశాలలు, ఒకటి కస్తూరిబాగాంధీ పాఠశాల కలుపుకోని మొత్తం 60 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 4308 మంది విద్యార్థులు విద్యాను అభ్యసిస్తున్నారు. కాగా, మండలంలోని వీఆర్‌కేపురం పాఠశాల, బెస్తగూడెం పాఠశాల, మహితాపురం పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. నూతన భవనాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక పోవడంతో వరండాల్లో విద్యార్థులను కూర్చోబెట్టి ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. మండలంలో మంజూరైన అమ్మ ఆదర్శ పాఠశాలలు సైతం పనులు అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థులకు అవస్థలు తప్పటం లేదు. కాగా, చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాల-2లో పాత భవనం శిథిలావస్థకు చేరుకోవటంతో స్లాబ్‌పై పెచ్చులు ఊడి పడతున్నాయి. కొత్తగా నిర్మించిన ఆశ్రమ పాఠశాలలో పనులు పూర్తి కాలేదు. కొత్త భవనంలో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయలేదు. కాగా మండలంలోని 14 పాఠశాలకు చుట్టూ ప్రహరీ లేదు, 10 స్కూళ్లల్లో మరుగుదొడ్ల సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల్లో ఉన్న సమస్యలను అధికారులు పట్టించుకోవటం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. ఇప్పటికైనా అధికారులు పాఠశాలలో ఉన్న స మస్యలను పరిష్కరించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలో ఉన్న సమస్యను అధికారులు పరిష్కరించాలి. శిథిలావస్థలో ఉన్న భవనం నుంచి కొత్త భవనంలోకి విద్యార్థుల తరగతి గదులు, హాస్టల్‌లో వసతి ఏర్పాటు చేయాలి.

- చేలే నవీన్, చిరుతపల్లి

పోచమ్మ తల్లి విగ్రహానికి జలాభిషేకం

మొగుళ్లపల్లి: వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుంటూ గురువారం మండల కేంద్రంలోని మహిళలు గ్రామ దేవత పోచమ్మ తల్లి విగ్రహానికి జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమైన వర్షాలు సరిగా కురువకపోవడంతో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుంటూ జలాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు.



జలాభిషేకం చేసిన మహిళలు